బిజెపిని ఇంటికి సాగనంపుదాం

- బెదిరింపు రాజకీయాలు మానుకోవాలి - ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - పత్తికొండ

మతోన్మాద బిజెపిని ఇంటికి సాగనంపుదామని, దేశంలోని బిజెపి ప్రధాని నరేంద్ర మోడీ బెదిరింపు రాజకీయాలను మానుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హితవు పలికారు. శుక్రవారం పత్తికొండలోని నాలుగు స్తంభాల కూడలి నుంచి ఇండియా కూటమి అభ్యర్థులు, నాయకులు చదువుల రామయ్య భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పత్తికొండలో చదువుల రామయ్య భవనం ఆవరణంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. బిజెపికి మరోసారి అధికారం ఇవ్వాలని ప్రజలను మభ్య పెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్నే మార్చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ఎన్నికల ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పదేళ్లయినా ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. భారతదేశం లౌకిక దేశమని, మతాల మధ్య చిచ్చులు పెడుతూ ప్రధాని మోడీ ఓట్లు అడిగేందుకు ముందుకొస్తున్నారని మండిపడ్డారు. దేశానికి ప్రమాదకరంగా ఉన్న మోడీకి ప్రత్యక్షంగా టిడిపి, పరోక్షంగా వైసిపిలు మద్దతు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఒక్క శాతం కూడా ఓట్లు లేని బిజెపికి ఆరు పార్లమెంటు స్థానాలు, పది అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడం ఇంతకంటే దిగజారుడుతనం లేదని తెలిపారు. మోడీ విధానాలను ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్, ఎన్నికల కమిషన్‌ను ఉపయోగించి బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీని ఓడించేందుకు కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, ఆమ్ ఆద్మీ, ఇతర పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడితే మోడీకి భయం పట్టుకొని, ఇండియా కూటమిలో ఉన్నారన్న కక్ష సాధింపుతో ఏ నేరం చేయకపోయినా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను తీహార్ జైలులో ఉంచారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రూ.48 వేల కోట్లతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. మద్య నిషేధమని చెప్పి చేయకపోగా మద్యంపై రూ.వేల కోట్లు సంపాదించారని విమర్శించారు. అసెంబ్లీలో కమ్యూనిస్టులు లేకపోవడంతో ప్రజా సమస్యలపై చర్చించకుండా బూతు పురాణాలు వల్లెవేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించేందుకు కమ్యూనిస్టులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఇండియా కూటమి బలపరుస్తున్న కర్నూలు సిపిఎం అభ్యర్థిని, సిపిఐ పత్తికొండ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి పి.రామచంద్రయ్యను, కర్నూలు ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్‌ను గెలిపించాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, జిల్లా నాయకులు వీరశేఖర్, వెంకటేశ్వర రెడ్డి, మండల కమిటీ సభ్యులు గంగన్న, దస్తగిరి, గోపాల్, సిద్ధయ్య, వెంకటేష్, సిపిఐ జిల్లా నాయకులు నబి రసూల్, సుల్తాన్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, లక్కీ టు నరసింహులు పాల్గొన్నారు.

పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో
సామాజిక హక్కుల పరిరక్షణకు ఉద్యమం

- డికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

భారత స్వాతంత్ర్య ఉద్యమకారుడు, రాజ్యాంగ హక్కుల పరిరక్షకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో సామాజిక హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. శుక్రవారం కెవిపిఎస్, డప్పు కళాకారుల సంఘం, కాటికాపరుల సంఘం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. నగరంలోని ఆర్ఎస్ రోడ్డు కూడలిలో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ బాబు, కాటికాపరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు డి.విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.భాస్కర్, ఎ.గురు స్వామి, ఐలు జిల్లా నాయకులు శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు అమర్ మాట్లాడారు. జగ్జీవన్ రామ్ స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త అని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చాక ఏర్పడిన మొదటి పార్లమెంటులో అత్యంత చిన్న వయస్సు కలిగిన మంత్రిగా ఆయన రాజకీయ జీవితం ఉన్నత స్థితికి చేరుకుందని తెలిపారు. కార్మిక, రైల్వే, వ్యవసాయ, విదేశాంగ మంత్రిగా 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు అలంకరించడమే కాకుండా ఉపప్రధానిగా దేశానికి సేవలు అందించారని చెప్పారు. రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లకు ఆదిలోనే ఆటంకాలు కల్పిస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని అమలు చేయించిన ఘనుడు జగజ్జీవన్ రామ్ అని కొనియాడారు. లౌకిక రాజ్యాంగాన్ని రక్షించుకోవడంతో పాటు మతోన్మాద విధానాలతో దేశాన్ని ముక్కలు చేస్తున్న బిజెపి విధానాలకు వ్యతిరేకంగా, ఆ విధానాలకు పార్లమెంట్ మద్దతు తెలుపుతున్న వైసిపి, టిడిపిలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. కెవిపిఎస్ నాయకులు రామాంజనేయులు, నాగరాజు, యోగానంద్, అభి, అష్రఫుల్లా ఖాన్ పాల్గొన్నారు. అలాగే నగరంలోని బుధవారపేట భవానమ్మ గుడి ముందు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి సిపిఎం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలోని 'ఫైవ్' రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న జగజ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామకృష్ణ అధ్యక్షత వహించారు. జనం కోసం రాజకీయం అన్న మాట మారిందని, మతం కోసం రాజకీయం, పెత్తనం కోసం రాజకీయం, పెత్తందారులకు దోచిపెట్టడం కోసం రాజకీయమన్న చందంగా నేటి రాజకీయం కొనసాగుతోందని విమర్శించారు. సిపిఎం నగర నాయకులు కృష్ణ, చంద్ర, రమేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఆనంద్‌బాబు, నాయకులు

నివాళులర్పిస్తున్న గౌస్‌దేశాయి, రాధాకృష్ణ

భానుడి భగభగలు

- 44 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత - వేసవి తాపానికి అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లాలో భానుడు భగభగలాడుతున్నాడు. జిల్లాలో అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ నెల ఆరంభానికి వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు...

ఫిబ్రవరి రెండో వారం నుంచి భగభగలాడుతున్న సూర్యుడు ఏప్రిల్ ఆరంభం నాటికి తన ప్రతాపాన్ని పెంచేశాడు. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. కర్నూలు జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 41 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 44 డిగ్రీలకు చేరుకుంది. కర్నూలు నగరంలో శుక్రవారం అత్యధికంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆలూరులో అత్యధికంగా 40 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని, అలాంటి మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే నిజమైన నివాళి అని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. శుక్రవారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నగరంలోని ఆర్ఎస్ రోడ్డు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ సృజన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకుడు బాబు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. కేంద్ర మంత్రిగా పని చేసిన సమయంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన గొప్ప నాయకుడని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని భావితరాలకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. భారతదేశంలో హరిత విప్లవం, భారత వ్యవసాయాన్ని ఆధునీకరించడంలో ఆయన అందించిన సహకారం ప్రశంసనీయమని కొనియాడారు. జగ్జీవన్ రామ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి కుటుంబంలోని పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జెడి రంగలక్ష్మీదేవి, సెట్కూర్ సిఇఒ రమణ, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, జిల్లా కోశాధికారి యెహోషువా, జిల్లా సహాధ్యక్షులు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శి తిమ్మన్న, రాష్ట్ర కౌన్సిలర్ జయరాజు, జిల్లా నాయకులు హనుమన్న, సోమన్న, వెంకటేష్ పాల్గొన్నారు. అలాగే నగరంలోని ప్రజా పరిరక్షణ సమితి కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి నాయకులు డేవిడ్, పద్మానంద, యోగీ, డైమండ్ అబ్దుల్ సలాం, పురుషోత్తమ, కవి భైరవ, నరసింహ, సూరి, శివమణి, ఈశ్వర్, చంద్ర, రవి ప్రసాద్, శ్రీరాములు, మోహన్, చంద్ర శేఖర్, శివ, కల్లూరు వెంకటేశ్వర్లు, బ్రహ్మ, విష్ణు పాల్గొన్నారు.

పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సృజన

గఫూర్ మియాను పరామర్శిస్తున్న నాయకులు

సిపిఎం నాయకుడికి సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు పరామర్శ

ప్రజాశక్తి - కోడుమూరు : గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సిపిఎం కోడుమూరు నాయకుడు గఫూర్‌మియాను సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం పరామర్శించారు. సిపిఐ, ఎఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ సమితి నేతలు కృష్ణ, రాజు, శేషు కుమార్, మునిస్వామి, భాస్కర్, ఆటో మధు, ఓబులేసు, సాగర్, పెద్దయ్యలు ఆయన ఇంటికి చేరుకొని గఫూర్‌మియాకు ధైర్యం చెప్పి, త్వరలోనే అనారోగ్యం నుండి బయటపడతారని భరోసానిచ్చారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : కెఇ శ్యాంబాబు

ప్రజాశక్తి - క్రిష్ణగిరి : పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమవుతుందనిపత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కెఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం క్రిష్ణగిరి మండలం లాల్‌మాన్‌పల్లె, చిట్యాల గ్రామాల్లో బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలను ఆడిగి తెలుసుకున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని, అధికారంలోకి వచ్చిన వెంటనే బాబు సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి ఆలంకొండ నబి సాహెబ్, మండల అధ్యక్షులు శ్రీరాములు, తెలుగు యువత అధ్యక్షుడు రఫీ, మాదాపురం గురుస్వామి, నాయకులు షేక్ కాలేసాహెబ్, జిల్లా మైనార్టీ మెంబర్ షేక్ మదార్ సాహెబ్, కాశీంసాహెబ్, లాలూ భాష, సుభాన్, మాచాపురం మాదన్న, మాధవరావు, నాగమణి, బండ్ల కట్టి శ్రీరాములు, శ్రీధర్, ఐ టిడిపి పందిళ్ళపల్లి నీలకంఠేశ్వరయ్య, కనికి రెడ్డి మదన్మోహన్, శ్రీరాములు, హరికృష్ణ, శేఖర్ మాదిగ, నడిపి రంగన్న, చిట్యాల సర్పంచు రాజేశ్వరి గౌడు, నక్క నాగరాజు , హరి ప్రకాష్ గౌడ్, మనీష్ గౌడ్, మద్దయ్య గౌడ్, గుండాలయ్య గౌడ్, రఘు, శ్రీధర్ గౌడ్, శివ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కెఇ శ్యాంబాబుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

పాలకుల నిర్లక్ష్యంతోనే నగరంలో తాగునీటి సమస్య

- నాటి ఎమ్మెల్యే గఫూర్ కృషి వల్లే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం - 30 వేల మంది కుటుంబాలకు ఇళ్ల పట్టాల పంపిణీ
- మళ్లీ నగరాభివృద్ధి చెందాలంటే సిపిఎం అభ్యర్థిని గెలిపించాలి - 43వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నియోజకవర్గం అభివృద్ధికి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు ఆ పార్టీ నాయకులు కోరారు. సిపిఎం అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం నగరంలోని 43వ వార్డు ఇల్లూరు నగర్, సీతారాం నగర్, రెవెన్యూ కాలనీ, మార్కెట్ యార్డు నరసింహారావు నగర్, గూడెం కొట్టాలలో పార్టీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ గతంలో ఎంఏ.గఫూర్‌ని సిపిఎం ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిపించడం వల్ల కర్నూలు నగరంలో అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కర్నూల్ నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతోపాటు 16 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి తాగునీటిని అందించ గలిగారని తెలిపారు. ప్రస్తుతం నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ అవసరం ఉన్నా పాలకుల నిర్లక్ష్యంతో అది సాధ్యపడడం లేదన్నారు. కానీ మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే గఫూర్ 200 ఎకరాలు స్థలాన్ని కూడా తీసి పెట్టారని, కానీ నేటి పాలకులు ఇంతవరకు మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. కర్నూలు నగరంలో 30 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించిన ఘనత సిపిఎందేనని తెలిపారు. ప్రస్తుత పాలకులు ప్రజలపై నిత్యవసర వస్తువుల ధరలు పెంచి ఆర్థిక భారాలను వేయడమే పనిగా పెట్టుకున్నారు తప్ప కర్నూల్ నగరంలో ఎలాంటి అభివృద్ధి చేపట్టడం లేదని విమర్శించారు. నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సిపిఎంని ఆదరించి సుత్తి కొడవలి నక్షత్రం గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని, అవకాశవాద టిడిపి, బిజెపి, జనసేన, వైసిపి పార్టీలను ఓడించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు శంకర్, హుస్సేన్ బాషా, భాస్కర్, శ్రీనివాసులు, శ్రీను, లాల్ అహమ్మద్, సుధాకర్, మార్కెట్ యార్డ్ హమాలీలు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టర్ : కర్నూల్ నగరంలో అభివృద్ధి జరగాలంటే సిపిఎం అభ్యర్థి గెలుపు ద్వారానే సాధ్యమవుతుందని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు అన్నారు. బిల్డింగ్ వర్కర్స్, హమాలీ వర్కర్స్, హోటల్ వర్కర్స్, ప్రైవేట్ ఎంప్లాయిస్ కలిసి కర్నూలు నగరంలోని 17వ వార్డులోని చాణిక్యపురి కాలనీ, సప్తగిరి నగర్, సంజయ్ గాంధీ నగర్, గిరి ప్రసాద్ నగర్, ఏ క్యాంపు క్వార్టర్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. సిఐటియు నాయకులు నాగరాజు, బజారి, బాలరాజు, సంసోన్ మాసుం, తిప్పన్న, జయసూర్య, మాబాషా, మహేందర్, రాజశేఖర్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

43వ వార్డులో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేస్తున్న సిపిఎం నగర కార్యదర్శి టి రాముడు, సుధాకరప్ప తదితరులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్

జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న జెడ్పి సిఇఒ

మైపర్ ఫార్మసీ కళాశాలలో నివాళ్లులర్పిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

- జెడ్పి సిఇఒ నాసర రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని, అటువంటి మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించడమే నిజమైన నివాళి జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ మినీ మీటింగ్ హాల్‌లో జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి సిఇఒ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. జిల్లా పరిషత్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో కమిషనర్ ఎ.భార్గవ్ తేజ నివాళులు అర్పించారు. అదనపు కమిషనర్ పి.వి.రామ లింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ చుండీ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జి.ఎం.శ్రీకాంత్, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే ఎపి ట్రాన్స్‌కో అండ్ ఎం సర్కిల్ ఆఫీస్‌లో ఎండి ఎంఎస్ఇ బాబు రాజేంద్ర, కన్స్ట్రక్షన్ ఎస్ఈ కెవి రామకృష్ణ, ఈఈ వేణుమాధవ్ తదితరులు నివాళ్లులర్పించారు.

మైపర్ ఫార్మసీ కళాశాలలో : కర్నూల్ నగరంలోని ఏ క్యాంపులోని మైపర్ ఫార్మసీ కళాశాలలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కాసర్ల సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో : వెంకటరమణ కాలనీ మొదటి లైన్‌లో ఉన్న నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లయన్ రాయపాటి శ్రీనివాస్ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ అధ్యక్షురాలు లయన్ రాయపాటి నాగలక్ష్మి, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

తుగ్గలి : తుగ్గలి తహసీల్దార్, ఎన్ఆర్ఈజీఎస్, జొన్నగిరి ప్రభుత్వ వసతి గృహంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు.

జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళు లర్పిస్తున్న రాయపాటి శ్రీనివాస్


ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

41వ వార్డులో ఎమ్మెల్యే కాటసాని ప్రచారం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 41వ వార్డులో పాణ్యం ఎమ్మెల్యే, వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని చెబుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతా రెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, దండు లక్ష్మి కాంతారెడ్డి, సాన శ్రీనివాసులు, నాయకులు పెద్దపాడు శ్రీధర్ రెడ్డి, కవినాథ్ రెడ్డి, అర్బన్‌లోని పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

అంధులకు, నడవలేని వారికి ఇంటి వద్దకే ఓటు హక్కు : తహశీల్దార్

ప్రజాశక్తి - సి.బెళగల్

అంధులకు, పూర్తిగా నడవలేని వారు ఇంటి వద్దకే తమ ఓటును వినియోగించుకోనేలా ప్రభుత్వం హక్కును కల్పించిందని తహశీల్దార్ డాక్టర్ అనుపమ పేర్కొన్నారు. శుక్రవారం బిఎల్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో పోలింగ్ కేంద్రాల దగ్గరకు రాలేని అంధులకు, నడవలేని వికలాంగులకు, మంచాన పడ్డ వృద్దులకు ఇంటి వద్దనే ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. అలాంటి వారి జాబితా మండలంలో పకడ్బందీగా తయారు చేయాలని పేర్కొన్నారు.

నేటి నుండి ఎస్‌ఎ-2 పరీక్షలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఒకటి నుండి 9వ తరగతి విద్యార్థులకు శనివారం నుండి సమ్మెటీవ్ అసెస్మెంట్–2 పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు పరీక్షలు యధావిధిగా జరుగుతాయని, స్కూల్ కాంప్లెక్స్ నుండే పాఠశాల హెచ్‌ఎంలు ప్రశ్నాపత్రాలను తీసుకువెళ్లాలని తెలిపారు.

జిల్లాలో 93 శాతం పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో సామాజిక భద్రత పెన్షన్లు దాదాపు 93 శాతం పంపిణీ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సలీం బాషా శుక్రవారం వెల్లడించారు. జిల్లాలో మొత్తం పెన్షన్లు 2,46,871 ఉండగా 2,31,892 పెన్షన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 14,979 పెన్షన్లను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. శనివారం నాటికి వందశాతం పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌ల
పని ఒత్తిడితో అంగన్వాడీ మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

నివాళులర్పిస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ పరిధిలోని అంగన్వాడీలకు వివిధ రకాల యాప్‌లు ప్రవేశ పెట్టడం వల్ల ఒత్తిడికి గురై రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలు మరణిస్తున్నారని సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు తెలిపారు. గురువారం ఆస్పరి సెంటర్-2లో పని చేస్తున్న అంగన్వాడీ టీచర్ జయమ్మ విధుల్లో ఉండగా అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారని చెప్పారు. అంగన్వాడీలకు సంబంధం లేని అనేక రకాల యాప్‌లను ప్రభుత్వ అధికారులు ఒత్తిడి చేసి పని చేయిస్తున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకమంది అంగన్వాడీలు పని ఒత్తిడికి గురై అనారోగ్యంతో చనిపోతున్నారని చెప్పారు. అనేక సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో అంగన్వాడీలు పని చేస్తున్నారని తెలిపారు. 45 రోజులు సమ్మె చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. శుక్రవారం జయమ్మ స్వగ్రామమైన బిణిగేరికి సిఐటియు నాయకులు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంగవైకల్యం ఉన్నా విధుల్లో సక్రమంగా పని చేసేవారని, ఆస్పరి సెక్టార్ పరిధిలో అంగన్వాడీ యూనియన్ ఐక్యం కోసం పని చేశారని తెలిపారు. జయమ్మ కుటుంబంలో భర్త, కుమారుడు, కుమార్తె కూడా వికలాంగులేనని చెప్పారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి అంగన్వాడీ ఉద్యోగం ఇవ్వాలని, రూ.5 లక్షల పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఇబ్బందికరమైన యాప్‌లను వెంటనే తొలగించి వారి ఆదుకోవాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, రైతుసంఘం మండల అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ఆస్పరి సెక్టార్ అంగన్వాడీ యూనియన్ నాయకులు విశ్వకుమారి, రాణి, రసూల బేగం, లతా పాల్గొన్నారు.

మాకు దిక్కెవరు..?

- ప్రచారానికి వెళ్లే పరిస్థితిలో లేమన్న మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్ టిడిపి అధిష్టానం బిజెపికి కేటాయించడం ఎందుకు జరిగిందో అర్థం కావడం లేదని, ఇకముందు తమకు దిక్కెవరని, తమకు, కార్యకర్తలకు ఏమైనా జరిగితే ఆదుకునేది ఎవరని టిడిపి నాయకులు అధిష్టానం పంపిన నేతలతో పేర్కొనట్లు సమాచారం. ఎమ్మెల్యే టికెట్ బిజెపి అభ్యర్థికి కేటాయించడం వల్ల టిడిపి కేడర్ మొత్తం సందిగ్ధంలో ఉందని, ఇకముందు నియోజకవర్గంలో టిడిపిని నడిపించే నాథుడు ఎవరని పేర్కొన్నట్లు తెలిసింది. టిడిపి, బిజెపి, జనసేన పార్టీ అధిష్టానాలు ప్రకటించిన బిజెపి అభ్యర్థి పార్థసారథి గెలుపునకు కృషి చేయాలని అధిష్టానం పంపిన నాయకులు పేర్కొన్నట్లు సమాచారం. జిల్లా టిడిపి అధ్యక్షులు బిటి.నాయుడు, టిడిపి జోన్ 5 ఇన్‌ఛార్జ్ బీద రవిచంద్ర యాదవ్, ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి, ఎంపీ సంజీవ్ కుమార్ ఆదోనిలో టిడిపి నాయకులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా టిడిపి అధ్యక్షులు బిటి.నాయుడు స్వగృహంలో టిడిపిలో రెండో, మూడో గ్రూపుగా కొనసాగుతున్న మాజీ ఛైర్మన్ భాస్కర్ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్రప్ప, టిడిపి మాజీ ఇన్‌ఛార్జ్ గుడిసె కృష్ణమ్మ, పెద్ద మసీదు నిర్వాహక కమిటీ ఛైర్మన్ సౌదీ రావుఫ్, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, మైనార్టీ నాయకులు ఉమ్మి సలీం, ఓటరు నమోదు కమిటీ జిల్లా అధ్యక్షులు, ఆర్‌సిసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డితోపాటు ఇతర నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు బిజెపికి ఆదోని టికెట్ కేటాయించడం వల్ల తాము బయటకు వెళ్లి ప్రచారం చేయలేని పరిస్థితిలో ఉన్నామని, చివరకు తాము చెప్పినా తమ కుటుంబంలోని సభ్యులు సైతం బిజెపికి ఓటు వేయరని, వైసిపి అభ్యర్థి సాయి ప్రసాద్ రెడ్డికి ఓటు వేస్తారని పేర్కొన్నట్లు సమాచారం. బిజెపికి టికెట్ కేటాయించే ముందు ఎందుకు నాయకుల అభిప్రాయాలు తీసుకోలేదని ప్రశ్నించినట్లు తెలిసింది. తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఒకటేనని, ఇప్పటికైనా అధిష్టానం ఆలోచించి టిడిపికే టికెట్ ఇవ్వాలని కమిటీని కోరినట్లు సమాచారం. ఇదే సమావేశంలో మరికొంతమంది నాయకులు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిని మార్చాలని కోరినట్లు తెలిసింది. కొత్త ఇన్‌ఛార్జిని ప్రకటిస్తేనే తాము ఎన్నికల్లో బిజెపి అభ్యర్థికి పని చేస్తామని ప్రకటించినట్లు సమాచారం.

నియోజకవర్గంలో అందరూ కలిసి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు టికెట్ రాకుండా చేశారు కదా.. మళ్లీ ఎందుకు వచ్చారని టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించినట్లు సమాచారం. మీనాక్షి నాయుడు స్వగృహానికి వెళ్లి సమావేశం నిర్వహించారు. 'మీకు తెలియకుండానే ఆదోని టికెట్ బిజెపికి కేటాయించారా..?, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు ఇంత అన్యాయం జరుగుతున్నా ఎందుకు ప్రశ్నించలేద'ని మీనాక్షి కుటుంబ సభ్యులు కొంతమంది అధిష్టానం కమిటీని ప్రశ్నించినట్లు సమాచారం.

మాట్లాడుతున్న నాయకులు (ఫైల్)

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

- సబ్ కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ శేషయ్య
- ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

ప్రజాశక్తి - ఆదోని

స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల ఆశా జ్యోతి అని ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ శేషయ్య తెలిపారు. శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహశీల్దార్లు రుద్ర గౌడ్, దీపా, సీనియర్ సహాయకులు రామచంద్ర, కార్యాలయపు సిబ్బంది ఈరన్న ఉన్నారు. అలాగే ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అరుంధతి నగర్, తిమ్మారెడ్డి బస్టాండ్ ఆవరణంలో ఉండే బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.నాగేంద్రప్ప, జి.భాస్కర్, ఎంఎస్‌పి జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు పిఎస్.వీరేష్, ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు బండారి గిడ్డయ్య మాదిగ, హెబ్బటం జి.రాజు మాదిగ, టౌన్ నాయకులు టి.ఈరన్న, శరణప్ప, పట్టణ కన్వీనర్ వన్నెల మణికంఠ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు హుస్సేనప్ప, అంజనప్ప, ఎంఎస్‌పి 9వ వార్డు ఇన్‌ఛార్జ్ జిఎస్.దత్తు, ఆర్లయ్య, కాలనీ వాసులు విజయ్, రాజు, చంద్రయ్య, దుబ్బా ఈరన్న, రాముడు, పోకిరెడ్డి సొంటన్న, మల్లన్న ఉన్నారు. అలాగే తిమ్మారెడ్డి బస్టాండ్ ఆవరణలో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు, దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్.దైవ ప్రసాద్ నివాళులర్పించారు. వైసిపి నాయకులు శంకర్ నగర్ నాగేంద్రప్ప, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు జైభీమ్ సాయిరామ్, మాల మహానాడు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిఆర్.స్వామి, మాల మహానాడు నాయకులు నరేష్ కుమార్, యూత్ ప్రెసిడెంట్ జగదీష్, యాపమాన్ వీరేష్, లక్ష్మీకాంత, తలారి ఆంజనేయులు, తాయప్ప, నకులరాజు, సంజీవ్ ఉన్నారు. **చిప్పగిరి** గ్రామం ఎస్సీ కాలనీలో ఆర్‌డిటి బిల్డింగ్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. వైసిపి నాయకులు మనోహర్, నారాయణ స్వామి, ఎస్.లక్ష్మీనారాయణ, క్లింటన్, జి.సురేష్, వై.మల్లయ్య, ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు జిఎస్.నెట్టికంటయ్య (మందకృష్ణ గ్రూపు)లు బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **మంత్రాలయం** ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రామతీర్థం అమ్రేష్ మాదిగ, కెవిపిఎస్ నాయకులు అంజి మాట్లాడారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి మాదిగ రత్నం, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ సంఘటి యోహాను మాదిగ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గర్జి హనుమంతప్ప మాదిగ, నాయకులు దేవరపాటి అనిల్ కుమార్, కందనాతి మారెన్న, మండల అధ్యక్షులు గాడిమోడి నరసింహులు మాదిగ, మద్రి రాజు, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ జిల్లా కో ఆర్డినేటర్ సుమాల చార్లెస్, ప్రసన్న కుమార్, ఎంఆర్‌పిఎస్ తాలూకా అధ్యక్షులు అబ్రహాం, కెవిపిఎస్ మండల నాయకులు సూగూరు అంజి, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ బూదూరు నాయకులు కొండయ్య, సాగర్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మహాదేవ, డప్పు కళాకారులు మారేష్, దస్తగిరి, ఆటో కార్మికులు వీరన్న గౌడు, బబ్లు పాల్గొన్నారు. **నందవరం**లోని ఓ ప్రయివేట్ భవనంలో జైభీమ్ ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి శాంతిరాజు ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షులు బుజ్జిబాబు, మండల ఇన్‌ఛార్జ్ పోతప్ప, మండల కన్వీనర్ సత్యన్న, మండల నాయకులు భాస్కర్ పాల్గొన్నారు. **ఆస్పరి**లోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సంజప్ప, మండల కన్వీనర్ రామాంజినేయులు, మండల మాజీ కన్వీనర్ సంజన్న, శ్రీను, అంజినయ్య, బొజ్జప్ప, బాబు, రామాంజి పాల్గొన్నారు. **హొళగుంద**లోని ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు. ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు, ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య మండల అధ్యక్షులు నల్ల మల్లేష్, బుడగ జంగాల తాలూకా నాయకులు మాదిగ రామాంజనేయులు, దళిత నాయకులు దేవేంద్ర, బుడగ జంగాల నాయకులు ముగ్గు గోవిందు, కొండయ్య, ధూపం అంబులు, దూదేకుల సంఘం నాయకులు హుసేని, రంజాన్ సాబ్, చలవాది రంగప్ప పాల్గొన్నారు.

ఆదోనిలో నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ శేషయ్య

గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

హోళగుదలో నివాళులర్పిస్తున్న నాయకులు

మృతి చెందిన మిత్రుని కుటుంబానికి
పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

- కుమార్తె చదువుకు అండగా ఉంటామని హామీ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మృతి చెందిన మిత్రుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి... గోనెగండ్ల గ్రామానికి చెందిన గొల్ల నరసింహులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003వ సంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్నారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆయనకు భార్య పరమేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్ది రోజుల క్రితం నరసింహుడు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందారు. ఆయన కుటుంబం ఇబ్బందుల్లో పడింది. వారి కుటుంబ పరిస్థితిని గమనించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003 బ్యాచ్ తోటి మిత్రులు స్పందించి రూ.53 వేల నగదును సేకరించారు. సేకరించిన మొత్తాన్ని శుక్రవారం గోనెగండ్లలోని నరసింహులు ఇంటికి వెళ్లి ఆయన భార్యకు తమ చిన్ననాటి గురువులు సుబ్రహ్మణ్యం రామన్ చేతుల మీదుగా అందజేశారు. నరసింహులు చిన్న కుమార్తె లీల చదువుకునేందుకు కూడా తగిన చర్యలు తీసుకొని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. తోటి మిత్రుని కుటుంబం ఇబ్బందులను గమనించి ఆర్థిక సహాయం అందజేయడంతోపాటు కుమార్తె చదువుకు కూడా సహకరిస్తామని ముందుకు వచ్చిన మిత్ర బృందాన్ని చూసి గ్రామస్తులు అభినందిస్తున్నారు. పూర్వ విద్యార్థులు షఫీ, రామ్మోహన్, రఫీ, బేతాళ హుస్సేన్, షఫీ, బాషా, అక్బర్, మద్దీ, చంద్రశేఖర్, చంద్ర, అలీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

సమన్వయంతో పని చేస్తే విజయం ఖాయం

- టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - చిప్పగిరి

జరగబోయే ఎన్నికల్లో గ్రూపు విభేదాలకు తావివ్వకుండా సమన్వయంతో ముందుకెళితే తప్పకుండా విజయం మనదే అవుతుందని టిడిపి ఆలూరు అభ్యర్థి వీరభద్ర గౌడ్ టిడిపి నాయకులకు, కార్యకర్తలకు తెలిపారు. శుక్రవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ స్వగృహంలో ఆయన అధ్యక్షతన టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ జడ్‌పిటిసి ఏరూరు మీనాక్షి నాయుడు, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు రవి యాదవ్, టిడిపి మాజీ కన్వీనర్లు కిష్టప్ప, భీమప్పలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ్‌ను కన్వీనర్ షేక్షావలీ, రవి యాదవ్ పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వీరభద్ర గౌడ్ మాట్లాడారు. మండలంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి పనులే తప్ప ఈ వైసిపి పరిపాలన వచ్చాక ఏ గ్రామంలోనూ ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరగాలంటే మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని తెలిపారు. అందరూ గ్రూపు విభేదాలను పక్కనపెట్టి టిడిపి గెలుపు కోసం పని చేయాలని కోరారు. వీరభద్ర గౌడ్ సమక్షంలో నేమకల్లు, కాజీపురం, బంటనహాళ్ గ్రామాలకు చెందిన దాదాపు 50 కుటుంబాలు టిడిపి కండువా వేసుకున్నాయి. సర్పంచులు పురుషోత్తం, సుశీలమ్మ, ఎంపిటిసి రజిని, టిడిపి నాయకులు తిమ్మయ్య, అంపయ్య, నెట్టప్ప, వన్నాల ఆంజనేయులు, సోమశేఖర్ నాయుడు, పులికొండ, నాగరాజు, ఏరూరు మహేష్, మిరపకాయల చంద్ర, నరసింహులు, నాగిరెడ్డి, జనార్ధన స్వామి, బోగేష్, సురేష్, రామాంజిని, హరినాథ్, లక్ష్మీనారాయణ, శ్రీరాములు, జయన్న, షేకన్న, కరి గోవిందు, ఓబయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్ర గౌడ్

నీటి నిల్వను పరిశీలిస్తున్న కమిషనర్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

- కమిషనర్ రామచంద్రరెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ పజలకు తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి సూచించారు. శుక్ర వారం మున్సిపల్ ఇంజినీర్ వెంకట చలపతి రెడ్డితో కలిసి పట్టణ శివారులోని బసాపురం సమ్మర్ స్టోరేజ్ వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెరువు కట్ట పటిష్టతకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్యాంకు సామర్థ్యం 3,110 ఎంఎల్ నీటి నిల్వకు గానూ 80 శాతం స్టోరేజ్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. రోజా కాలువ నుంచి నీటిని ట్యాంకులోకి మళ్లించాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నీరు జూన్ మాసం వరకు సరిపోతాయన్నారు. కాలువలో ప్రవాహం ఉన్నంత వరకు నీటిని ట్యాంకులోకి మళ్లిస్తూనే ఉండాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జనరేటర్ సదుపాయం కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజశేఖర్ రెడ్డి ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆర్‌ఒ ఆరా

సౌకర్యాలను పరిశీలిస్తున్న ఆర్‌ఒ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మురళీ ఆరా తీశారు. శుక్రవారం చిలుకలడోన, సూగూరు, వగరూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు తాగు నీరు, వెలుతురు, విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, వికలాంగుల సౌకర్యార్థం ర్యాంపుల వంటి వాటి గురించి పరిశీలించారు. ఎన్నికల ముందు రోజు నుంచి పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు సౌకర్యాల కల్పనకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై పరిశీలించారు. తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఇఒఆర్‌డి ప్రభావతి, విఆర్‌ఒలు శ్వేత, ఆనందం, నతానియేలు, ప్రభాకర్, విఆర్‌ఎ అనిల్ ఉన్నారు.

గ్రామానికి పేరు, ప్రతిష్టలు తెచ్చిన యువ కవి

ప్రజాశక్తి-ఆలూరు

కన్నడ సాహిత్య పరిషత్ ఆంధ్రప్రదేశ్ గడినాడ సంఘం ఆధ్వర్యంలో ఆలూరు మండలం కమ్మరచేడు గ్రామానికి చెందిన యువ కవి ఎం.రాజశేఖర్‌ను సన్మానించారు. గతనెల 31న కన్నడ సాహిత్య పరిషత్ ఆంధ్రప్రదేశ్ సంఘం అధ్యక్షులు అంజన్ కుమార్, కవి సమ్మేళన సభ అధ్యక్షులు డాక్టర్ శివన్న శాలువా, పుష్పమాల, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. శుక్రవారం గ్రామంలోని కవి మిత్రులు, సన్నిహితులు, గ్రామస్తులు సాహిత్యంలో ఇంకా మరెన్నో విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. సత్యసాయి జిల్లా హిందూపురంలోని కెహెచ్ ప్యారడైజ్ ఫంక్షన్ హాలులో మార్చి 31న 8వ కన్నడ సాహిత్య కవి సమ్మేళనం నిర్వహించారని తెలిపారు. కమ్మరచేడు గ్రామం నుంచి కవి, రచయితగా తాను పాల్గొని 'తీరని నీటి కష్టాలు' అనే విభిన్నమైన అంశంపై తనదైన శైలిలో కవిత గానం చేసినందుకు కన్నడ సాహిత్య పరిషత్ ఆంధ్రప్రదేశ్ సంఘం వారు ఘనంగా సన్మానించినట్లు చెప్పారు.

రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. శుక్రవారం స్థానిక శ్రీమఠంలో ఏకాదశీ తిథి సందర్భంగా రాఘవేంద్రుని మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో, తులసి మాలతో, కాషాయ వస్త్రాలతో అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళహారతులు ఇచ్చారు. ఏకాదశీ సందర్భంగా రాఘవేంద్రునికి ఎలాంటి అలంకారం లేకపోవడంతో పాటు నైవేద్య సమర్పణ కూడా ఉండదు. భక్తులకు అన్నదానం, పరిమళ ప్రసాదం విక్రయం లేకపోవడం ఆనవాయితీ. స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు కూడా ఉపవాస దీక్షలో ఉంటారు.

డిఇ, ఎఇలకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- డిఇ, ఎఇలకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - నందవరం

పొనకలదిన్నె గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం ఎమ్మిగనూరులోని డిఇ, ఎఇలకు తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ గ్రామంలో రెండు ట్యాంకుల నుంచి తాగునీటి సరఫరా చేసేవారని తెలిపారు. గత 15 రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడడంతో గ్రామంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నీటి అవసరాల నిమిత్తం పక్క గ్రామాలైన తిమ్మాపురం, దైవందిన్నెకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారని చెప్పారు. తమకు నీటి అవసరం తీరడం లేదన్నారు. తమ గ్రామానికి ఎల్‌ఎల్‌సి నుంచి తాగేందుకు నీరు హక్కుగా ఉందని తెలిపారు. అల్వాల సమ్మర్ స్టోరేజ్ నుంచి తమ గ్రామానికి నీరు వదలడం లేదన్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి గ్రామానికి తాగునీటి సరఫరా చేయాలని, లేకపోతే గ్రామం మొత్తం కలిసి పెద్ద ఎత్తున కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు అవుకు శ్రీరాములు, నరసింహుడు, మల్లయ్య, మల్లేష్, కొండన్న, మునెప్ప, మల్లయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

బిజెపి, టిడిపి, వైసిపిలను ఓడించండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు

బిజెపి, దానికి మద్దతు తెలిపే టిడిపి, వైసిపిలను ఓడించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం సిపిఎం ఎమ్మిగనూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.రామాంజనేయులు హాజరై మాట్లాడారు. దేశంలో నేడు రాజ్యాంగపరంగా జరిగే ఎన్నికలు భవిష్యత్తులో ఉండకపోవచ్చని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య ఎన్నికల స్థానంలో అధ్యక్షత తరహా పాలనకు కుట్రలు పన్నుతోందని విమర్శించారు. ఇది ఈ దేశానికి హానికరమని పేర్కొన్నారు. ఇప్పటికే రాజ్యాంగం రూపొందించిన చట్టాలను ప్రధాని మోడీ నాయకత్వంలో మార్పు చేయడం దుర్మార్గమన్నారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్న రాజకీయ నాయకులను తనకు అనుకూలంగా మారే వరకు ఈడీ, సిఐడి సంస్థల ద్వారా జైలులో పెట్టడం నియంతృత్వమని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం పన్నుల రూపంలో పేదలపై రూ.వేల కోట్ల భారం వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉనికి లేని బిజెపిని ఎన్నికల్లో సీట్ల ఒప్పందం చేసుకున్న టిడిపి, జనసేన కూటమిని ఓడించాలని కోరారు. వామపక్ష, లౌకిక పార్టీలను ఎన్నికల్లో ప్రజలు గెలిపించాలని కోరారు. సిపిఎం నాయకులు గోవిందు, హనుమంతు, లక్ష్మీనరసయ్య, సురేష్, అబ్దుల్లా, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

టిడిపి జెండా ఎగురవేస్తాం

- టిడిపి బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్

ప్రజాశక్తి - ఆలూరు

వీరభద్ర గౌడ్ సన్మానిస్తున్న నాయకులు

రానున్న ఎన్నికల్లో ఆలూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మనేకుర్తి రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం రాజశేఖర్ ఆధ్వర్యంలో మనేకుర్తి, అంగస్కల్, ఎ.గోనెహాల్ గ్రామ వార్డు సభ్యులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి అంబేద్కర్, వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీగా టిడిపి కార్యాలయానికి చేరుకొని వీరభద్ర గౌడ్‌ను పూలమాలతో సన్మానించారు. లింగన్న, మనేకుర్తి వైస్ సర్పంచి చిన్నరంగన్న, అల్లప్ప, మధు, దాదావలీ, నాగేష్, దేవేంద్ర, బంగి దేవేంద్ర, కిరిటప్ప, లక్ష్మి కాంత్, చంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

ధరణీధర్ పేరుపై భక్తులకు ఫలహారం పంపిణీ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన భక్తులకు ఫలహారం పంపిణీ చేశారు. శుక్రవారం ఏకాదశి తిథి సందర్భంగా స్థానిక తుంగభద్ర నది తీరంలో ఉన్న శ్రీకల్పవృక్ష షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. శ్రీమఠంలో అన్నదానం లేకపోవడంతో రాఘవేంద్రస్వామి అనుగ్రహం, పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో రాంపురం రెడ్డి సోదరుల సహకారంతో వైసిపి యువనేత ధరణీధర్ రెడ్డి పేరుపై భక్తులకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మా వారధి దిన పత్రిక యాజమాన్యం బెస్త బసప్ప, వైసిపి మండల నాయకులు మాధవరం రాజశేఖరరెడ్డి, ఒంగోలు ఇన్‌ఛార్జ్ సుబ్బారెడ్డి, మార్కాపురం కోటిరెడ్డి, కాస నాగేశ్వరరావు, ఖమ్మం శ్రీనివాసరావు, మార్కాపురం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచితంగా ఫలహారం పంపిణీ చేశారు. కురువ లింగన్న పాల్గొన్నారు.

మంత్రాలయం గడ్డపై టిడిపి జెండా ఎగురవేస్తాం

- టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిపై గెలిచి మంత్రాలయం గడ్డపై టిడిపి జెండా ఎగురవేస్తామని టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, సురేష్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కౌతాళంలో వైఎస్ఆర్ నగర్, ఉప్పర్ గేరి, అత్తర్ గేరి, కటిక వీధి, ఎన్‌టిఆర్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరారు. జగన్ పాలనతో రాష్ట్రమంతా అప్పుల పాలయిందని విమర్శించారు. ప్రజలు పంటలు పండక, ఉపాధి లేక వలసలు పోతున్నారని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వలసలను నివారిస్తామని చెప్పారు. ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి బాటలో నడిపిస్తామని తెలిపారు.

కౌతాళంలో టిడిపిలో చేరుతున్న నాయకులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

మండలంలోని కుంటనహాళ్ గ్రామానికి చెందిన ముస్లిం, మైనారిటీ నాయకులు టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు మాణిక్ బాష, హాజీ, మాప్సాన్ని, బుజ్జి, అంగడి నబి, రఫీ మరో 40 మంది కార్యకర్తలు టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, టిడిపి అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమపై నమ్మకంతో పార్టీలో చేరిన మైనార్టీ నాయకులకు అండగా ఉంటామని తెలిపారు. ఇటీవల మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి తనకు పోటే కాదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు పెట్టిన భిక్షతో ఎమ్మెల్యేగా ఉంటున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ గెలుపు ఖాయమన్నారు. సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, రామలింగ, సిద్ధప్ప, కురువ వీరేష్, నీల కంఠ రెడ్డి, దర్గా మౌలా, చిరుతపల్లి ఈరన్న, నవీన్, మారెప్ప, బుడదొడ్డి గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మంత్రాలయం : మండలంలోని రచ్చుమర్రి గ్రామం నుంచి సుమారు 20 కుటుంబాలు టిడిపిలో చేరినట్లు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. ఆయన స్వగ్రామమైన మాధవరంలోని ఆయన స్వగృహంలో వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. 20 కుటుంబాలకు చెందిన ఎన్.ఆదేశ్, జి.ఉరుకుందు, ఎం.వీరేష్, చిన్న వీరేష్, అయ్యప్ప, వీరారెడ్డి, కృష్ణ, మూలింటి రాముడు, వీరేష్, చాకలి వీరేష్, నాగరాజు, లింగమయ్య, వీరేష్, చాకలి కేశవ, మేకల హనుమంతు, నాగర్ల నాగేష్, నాగర్ల బోయ జోళ్ల, ఈడిగ నర్సప్ప టిడిపిలో చేరారు. వారికి రాఘవేంద్ర రెడ్డి, ఆయన సోదరులు రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీలకు మంత్రాలయం నుంచి టిడిపి టికెట్ వచ్చినందుకు బీసీలమైన తాము రాఘవేంద్ర రెడ్డి నాయకత్వం మెచ్చి వారి సమక్షంలో టిడిపిలో చేరినట్లు తెలిపారు. బాలనాగి రెడ్డిని ఓడించి మంత్రాలయం అభివృద్ధికి పునాదులు వేయబోతున్నామని రాఘవేంద్ర రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

మంత్రాలయంలో టిడిపిలో చేరుతున్న నాయకులు

IN THE COURT OF IIND ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI
I.A.No.165/2024 IN M.V.O.P. NO.58/2022

Boya Hussaini. ...Petitioner

VS

P. Umakantha Reddy and another. ...Respondents

NOTICE TO THE RESPONDENT NO.1.

To
Respondent No.1.
P. Umakantha Reddy S/O P. Manikya Reddy, Hindu, Aged about 38 Years, Drive cum Owner, H.NO.1-48, Kapa Street, Palakurthi Village, Devanakonda Mandal, Kurnool Dist.

Where as the above named petitioner filed petition Under Section 166 (1) (a) of Motor Vehicles Act for claiming compensation against you for the injuries sustained by the petitioner. Hence you are hereby required to appear before this court on **11.04.2024 at 10.30 AM** in person or through an advocate and answer the said claim petition, otherwise the matter will be decided exparte.

(By Court Order)

V. Lakshmalah, B. Com. B.L.
Advocate,
Yemmiganur Town,
Kurnool Dist. A.P.